చూపులు ★ కొండపల్లి సాంబమూర్తి

నర్సింగరావు గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. ఎంతకూ భార్య రాకపోవడంతో విసుగెత్తి, గది కానుకొని ఉన్న వరండాలోనికి వెళ్ళి, కిటికీలోంచి చూస్తూ నిల్చున్నాడు. ఏమీ తోచనప్పుడు ప్రకృతిని చూస్తూ ఆనందించడం అతనికో సరదా.

కొంతసేపటికి పార్వతి గదిలోనికి వచ్చి, నూనెతీసి తలకు రాసి దువ్వెనతో శుభ్రముగా తల దువ్వుకుంది. నిల్చుని జడ అల్లుకోవడం మొదలు పెట్టింది. నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో అలారం టైంపీసు చేస్తున్న 'టిక్కు టక్కు'లు తప్పించి ఇంకే శబ్దం లేకపోవడం ఆమెకు చిరాకు కల్గించిందేమో, మెల్లగా పాడడం మొదలు పెట్టింది. సినిమా పాటల్లో తన స్వంతమాటలు చేర్చి ఎవ్వరూ లేనప్పుడు పాడుకోవడం ఆమెకో అలవాటు.

"అందాల నా రాజ రావోయి
మల్లెపూవులు వెంట తేవోయి"

పాటవిని నర్సింగరావు మెల్లగా లోనికి ప్రవేశించి ఆమె వెనుకనున్న కుర్చీలో చప్పుడు చేయకుండా కూర్చున్నాడు.

అతనికి నవ్వువచ్చింది. కాని నవ్వుని బలవంతంపై ఆపుకుంటూ చప్పుడు చేయకుండా కూర్చున్నాడు.

"అందాల నా రాజ రావోయి
మల్లెపూవులు వెంట తేవో......"

అంటూ నవ్వలేక సతమతమౌతున్న భర్తను చూసి, తక్కున పాటనాపి నిర్ఘాంతపోయింది. నర్సింగరావు పక్కున నవ్వేశాడు. పార్వతి సిగ్గుపడింది.

"ఎవరో...ఆ అందాలరాజు?"

"మల్లెపువ్వులు తెచ్చారా?" మెల్లగా ప్రశ్నించింది.

"నేనే నన్న మాట...ఆ అందాలరాజుని? ...పువ్వులు తెచ్చి అరగంట కావస్తోంది. కిటికీమీదున్నాయ్, అలంకరించు."

పార్వతి కిటికీవద్దకు వెళ్ళి మల్లెపూవులు పొట్లం విప్పి దండ గుచ్చటానికి ఉపక్రమించింది.

"ఇంకా అలా కూర్చున్నారేం...లేచి బట్టలు వేసుకోండి."

"ఎందుకో...ఈ సింగారాలు?" ఇంటి వాసాలవైపు చూస్తూ అన్నాడతను.

"సినిమా చాల బాగుందట."

"వాటికేం...బోలెడంత డబ్బుపోసి తీస్తున్నారు. బాగులేవంటే, నీలాంటి సినిమా అభిమానులు ఊరుకుంటారా?"

"వాళ్ళంత డబ్బుపోసి తీస్తున్నారు కాబట్టే మనం వెళ్ళి చూడటం" ఎగతాళిగా అంది పార్వతి.

"తీసేవాళ్ళకు లేకపోతే చూసేవాళ్ళకయినా ఉండాలి. నీలాంటి వాళ్ళు డబ్బులివ్వబట్టే వాళ్ళు ఇంతకన్నా బాగా డబ్బు రావాలని ఉత్తమ చెత్తచిత్రాల్ని నిర్మిస్తున్నారు. చెత్తచిత్రాల కన్నిటికీ డబ్బుపోయటానికి నేనేం డబ్బు పోగుపెట్టుకుని కూర్చున్నాననుకున్నావా?" కోపంగా అన్నాడతను.

"అయితే ఈ పువ్వులెందుకు తెచ్చారు? డబ్బులు మిగులుతాయి, వాడికిచ్చేయండి" అంటూ చిరాకుగా అతని వడిలో పడేసింది.

"కాలవలో పారేయ్"అంటూ కోపంగా పువ్వుల్ని విసిరేశాడతను.

పువ్వులన్నీ నేలపై నక్షత్రాల్లా పడి వారి కోపం చూసి పకపక నవ్వేయి. కొంతసేపు మౌనంగా గడిచింది.

"పార్వతీ...పార్వతీ" అంటూ గదిలో ప్రవేశించింది గజలక్ష్మి.

గజలక్ష్మిని చూడటంతో అతనుకోపాన్ని కప్పిపుచ్చుకొని చిరునవ్వు నవ్వేడు. పార్వతి ముఖం ముడుచుకొని కూర్చుంది. పువ్వుల్ని చూసి గజలక్ష్మి సంగతి చాలవరకు అర్థం చేసుకుంది.

"ఏం...గజా, చిలకాకుపచ్చ చీరె కట్టి, చిలకలా తయారయేవే...ఏమిటి విశేషం?" నవ్వుతూ ప్రశ్నించాడు.

"పువ్వులన్నీ ఇలా పారేశారేం?" అంటూ గజ పువ్వులు తీయటానికి కూర్చుంది.

నర్సింగరావు అభిమానం దెబ్బతింది. తన ఇంట్లో తనభార్య చేయవలసిన పని, ఇతర స్త్రీ చెయ్యడమా!

"అలా ఉండనీ గజా, నేనెత్తుతాలే" అంటూ పువ్వులేరి ఆకుతో టేబిలుపై పెట్టేడు.

"పార్వతీ....ఇంకా బట్టలు మార్చుకోలేదేం? లే...లే..." అంది గజ.

"ఆయన సినీమాకు రారట" మెల్లగా చెప్పింది పార్వతి.

"రాకపోవడమే?...అలా అంటారుకాని తప్పకుండా వస్తారు. నువ్వు లేచి చీర మార్చుకో."

"నేనిప్పుడు రాలేను గజా" మెల్లగా అన్నాడతను.

"మా అక్క కోపం పోవాలంటే మీరిప్పుడు రావాలి. లేకపోతే నామీద ఒట్టు" చిలిపిగా అంది గజ.

నర్సింగరావు మాటాడకుండా ఊరుకున్నాడు.

"అలా చూస్తుండండి.....మా అక్కనిప్పుడు చిలకలా తయారుచేసి తీసుకు వస్తాను" అంటూ పువ్వులు పట్టుకొని పార్వతితో ప్రక్క గదిలోనికి వెళ్ళిపోయింది.

ఎలాగైతే నేం గజ బలవంతంపై సినీమాకు వాళ్ళతో బయలుదేరి వెళ్ళేడు నర్సింగరావు. తనమాటను త్రోసిపుచ్చి, గజమాటపై తన భర్త రావడం పార్వతి హృదయంలో ఆరని జ్వాలలా మండుతోంది.

నర్సింగరావు చెప్పినట్టుగానే చిత్రం కూడా ఉంది. చిత్రాలలో ఉత్తమ చిత్రాలకు బహుమతులిస్తున్నారు. అలాగే ఉత్తమ చెత్త చిత్రాలకుకూడా బహుమతులిస్తే బాగుంటుం దనిపించింది.

చెత్త చిత్రం తీయడమంటే మాటలా? అసహజ ఘట్టాల్ని ప్రవేశపెట్టాలి. నటులు మామూలుగా నటించక కృత్రిమంగా నటించాలి. అలా వారిచే నటింపజేయటానికి దర్శకుడు తన బుర్రను పాడు చేసుకోవాలి. పాటలు వినసొంపుగా ఉండకూడదు. మ్యూజిక్ కర్ణకఠోరంగా ఉండాలి.

కళా కౌశలం

రెండో ఆట సినిమాచూసి, ఒక పెద్దమనిషి ఈల పాట వేస్తూ ఇంటికి వెళ్తున్నాడు.

పెద్దవీధి మళుపు తిరగ్గానే మరో చిన్న సందులోంచి ఇంకో పెద్దమనిషివచ్చి, పలకరించాడు.

"టైమెంతండి?"

"పన్నెండున్నర"

"అవునుగాని ఇటు ఓ పోలీసాయన వచ్చాడు మీ కన్నబడ్డాడా? మా తమ్ముడే లెండి."

"అబ్బే లేదండి?"

"రైటో, మీ చేతివాచీ మనీపర్సు ఇలా ఇచ్చి, బుద్ధిగా ఇంటికెళ్ళిపోండి. నా దగ్గిర చాకు మొండిదైనా, మొన బాగానే ఉంది."

ప్రఖ్యాత ఆర్టిస్టులు తమ ఆర్టు నేమాత్రం ఉపయోగించ కూడదు. ఎంత కష్టం...ఎంత కష్టం. నిజంగా ఇటువంటి చిత్రాలకే బహుమతు లివ్వాలను కున్నాడు నర్సింగరావు.

సినిమాచూసి ఇంటికి వచ్చిన తరువాత కూడ చాలాసేపు ఎడమొహం పెడమొహంగానే ఉన్నారు దంపతు లిద్దరున్నూ. సంసారంలో చిన్న విషయాల మీదే సతీపతులకు ఎక్కువ పట్టింపు లొస్తాయి. కాని ఆ పట్టుదల లెంత సేపు?

భళ్లున తెల్లవారింది. పక్షుల కలకలా రావంతో పాటు శ్రుతి కలుపుతున్నాయి, నూతుల దగ్గర బిందెలు.

నర్సింగరావు ప్రక్కమీదనుండి లేచేడు. పార్వతి కనుపించలేదు. సిగరెట్టు ముట్టించి వరండాలోనికి వచ్చి కిటికీవద్ద నిల్చుని ప్రకృతి అందాన్ని చూస్తూ ఆనందిస్తున్నాడు.

పార్వతి గదిలోనికి వచ్చి చూసింది. భర్త ప్రక్కపై లేక పోవటంచే వరండాలోకి వచ్చి అతని వెనుక ప్రక్కగా నిల్చుంది. నూతివద్ద గజ నీళ్లు తోడుతోంది. నీళ్లుతోడుతూ ఎందుకో నవ్వుతోంది, గజ. పార్వతి హృదయంలో అగ్నికి వాయువు తోడైనట్లయింది.

"అంత దీక్షగా చూస్తున్నారేమిటి?"

"చూడు పార్వతీ...ఆ జామిచెట్టుపైనున్న ఆ చిలక ఎంతఅందంగా పండు తింటూందో?" చెప్తూ ఆనందిస్తున్నాడు నర్సింగరావు.

"పండు తినటం కాదు, మీ చిలక నీళ్లు తోడుతోంది. ఏం, అంతఅందంగా నీళ్లు తోడుతోందా?" పార్వతి వెగటు మాటలు విని ఆశ్చర్యపోతూ నూతివైపు చూసేడు. గజ బిందె నెత్తుకొని వెళ్లిపోతూంది. చెట్టుపైనున్న చిలక కూడ ఎగిరిపోయింది. కోపంగా పార్వతివైపు చూసేడు.

"ఏం చిలక వెళ్లిపోయిందని కోపమా? అది వెళ్ళిపోతే నేనేం చేస్తాను?"

"మనిషన్నప్పుడు హద్దు పద్దూ ఉండాలి. నోటికెలావస్తే అలా కూతలు కూయడం మంచిదికాదు. నీ అనుమానం వల్లనే సంసారాన్ని కడకు నాశనం చేసుకుంటావ్... ఇదే నేను నీకు చెప్పదలచింది" అంటూ కోపంగా గదిలోనికి వచ్చాడు.

"అనుమానం కాదు, నిజం; నిజం నేను తెలుసుకున్నానని బాధపడుతున్నారు కాబోలు. ఇంతకాలం నా ఎదుటనే జరుగుతున్న మీఇద్దరి హాస్యాలు, చేష్టలు గ్రహించలేకపోయేను. అక్కా...అక్కా...అంటూ వచ్చి నా భర్తనే వలలో వేసుకుంది...ఎంత నటన...ఎంతద్రోహం."

"పార్వతీ..." కోపంగా అరిచాడతను.

"ఏం...మీచిలక నన్నానని కోపమా?" మాట పూర్తి గాకుండానే ఆమె రెండు చెంపలు "పట్ పట్" మన్నాయి. చెక్కిళ్లు పట్టుకొని ఏడుస్తూ మంచంమీద పడిపోయింది పార్వతి.

మొహం కడుక్కొని, బట్టలు వేసుకొని రుసరుస లాడుతూ, కాఫీ త్రాగకుండా హాస్పిటల్‌కు వెళ్ళిపోయాడు. నర్సింగరావు ఒక ప్రైవేటు డాక్టరువద్ద కాంపౌండరుగా పనిచేస్తున్నాడు.

డాక్టరుగారు వ్రాసి ఇస్తున్న చీటీలకు ఏవో మందులు కలిపి ఇచ్చేస్తున్నాడు. నర్సింగరావు ముఖం చూసి డాక్టరు గారు కూడా అనుమానపడి, అతను మందులు కలుపుతున్నప్పుడు ఓ కంట కనిపెడుతున్నారు. అలవాటైన చెయ్యేమో, చిరాకుగాఉన్నా మందులు సరిగానే కలిపి ఇస్తున్నాడు నర్సింగరావు. అది విషమో, అమృతమో, తెలియని రోగులు మందుని చూసి రోగం పోయినట్లు ఆనందిస్తూపోతున్నారు.

పన్నెండు గంటలైంది. డాక్టరు గారు ఇంటికి వెళ్లిపోయేరు. నర్సింగరావుకి బాగా ఆకలి వేసింది. ఇంటికి వెళ్లకుండా "నేషనల్ కేఫ్"కు వెళ్ళి భోజనం చేసి హాస్పిటల్‌కు వచ్చి కొంతసేపు నిద్రపోయేడు.

మధ్యాహ్నం భర్త భోజనానికి రాకపోవడంతో పార్వతికి గజపై పూర్తిగా కోపంవచ్చింది. ప్రక్కింటికివెళ్లి స్నేహితురాలైన సుగుణవద్ద తన అక్కసునంతా వెళ్లగక్కింది. గజ తన సంసారాన్ని నాశనం చేయటానికే పూనుకుందని ఏడ్చి ఇంటికి వచ్చేసింది.

సుగుణ, గజ, పార్వతి ముగ్గురూ అత్యంత స్నేహభావంతో ఉంటూ ఒకరి కష్టసుఖాలొకరు చెప్పుకొనేవారు. కాని ఈనాడు గజపై పార్వతికివచ్చిన ద్వేషంచూసి సుగుణ విచారించింది. గజవద్దకు వెళ్ళి సంగతంతా పూర్తిగా చెప్పేసింది సుగుణ.

నాటినుండి గజ పార్వతి ఇంటికి రావడం మానేసింది. ఆమె రాకపోవడం చూసి నర్సింగరావు చాల సార్లు "నీవే మైనా అన్నావా?" అని ప్రశ్నించేడు. "నాకేమీ తెలియద"ంటూ భర్త నోకంట కనిపెడుతుండేది పార్వతి. నెలరోజులు గడిచాయి.

ఆ వేళ ఉదయం నర్సింగరావు కాఫీ త్రాగి పార్వతితో కబుర్లు చెప్తున్నాడు. గజ నిశ్శబ్దంగా గదిలోనికి ప్రవేశించింది. ఆమెను చూసి పార్వతి లేచి ముందుకు వచ్చింది.

ఉచిత బహుమానం!

నం. 501 తలనూనె వుపయోగించువారి జుట్టు విరివిగా పొడుగుగా అందముగా తుమ్మెదవలె యుండును.

ఒకసీసా రు. 2-8-0; 3సీసాలు రు. 6-8-0 ఒక్కొక్క బాటిలు కొనువారికి 15 సం|| గ్యారంటితో పనిచేయు రిష్టువాచి, ఒక కొత్త బంగారు వుంగరం బహుమానం యివ్వబడును. 8 సీసాలు ఒక్క సారికొన్నవారికి నాల్గు రిష్టువాచీలు, 4 వుంగరములు బహుమానం. ఇందులో ఏది నచ్చకున్నా ధరవాపస్

Saniyasi Ayurvedic Pharmacy,

(A.P.M.) P. B. 1397, Delhi.

★ చూపులు ★

"మధ్యాహ్నం మాఇంట్లో సత్యనారాయణ వ్రతం చేస్తున్నారు. నిన్ను రమ్మని మా అమ్మ చెప్పమంది," మొగం దించుకొనే చెప్పింది గజ.

"గజా...ఓ సారి ఇలా వచ్చి కూర్చో" మని మంచం చూపించేడు నర్సింగరావు.

గజ మెల్లగా వచ్చి మంచంపై మొగం దించుకొని కూర్చుంది. పార్వతి కుర్చీలో కూలబడింది.

"ఏం గజా...మా యింటికి పూర్తిగా రావడం మానేశావ్?" మెల్లగా ప్రశ్నించేడు నర్సింగరావు.

అతనీ ప్రశ్న వేస్తాడని తెలిసుంటే గజ ఆ ఇంటిలోనే కాలు పెట్టి ఉండేది కాదు. బాధగా అతని కళ్ళలోనికోసారి చూసి మొగం దించుకుంది. ఆమె చూపులు చూసి నర్సింగరావు బాధపడ్డాడు.

"చెప్పమ్మా...మనసులో నున్న బాధ ఇతరులతో చెప్పితే మనస్సు కొంత శాంతిస్తుంది. లేకపోతే ఆ బాధ ఆమనిషినే కృంగదీస్తుంది...ఇదివరకు ఈ ఇంట్లో కళకళలాడుతూ తిరిగే నువ్వు, రావడం మానేయడం నాకెంతో కష్టంగా ఉంది. నాకు స్వంత చెల్లెలు లేకపోయినా, గజ అనే చెల్లెలుందని నిన్ను చూసి ఆనందించేవాడిని. కాని నువ్వుకూడా రావడం మానేశావ్. ఈ అన్నయ్య ఇంటిపై నీకింత ఆగ్రహం ఎందుకొచ్చిందమ్మా?" బాధగా అడిగేడతను.

పార్వతికి ఈ మాటలు ఆశ్చర్యం కలిగించాయి.

గజ పెదిమలు మెల్లగా కదిలాయి.

"మనస్సు ఎట్లా చెబితే అట్లే చూస్తాయి కన్నులు. నన్ను దొంగలా చూస్తే దొంగలానే కన్పిస్తాను. ఒక మల్లెపూవు చెప్పకుండా తీసుకొని వెళ్ళిపోయే ననుకోండి. మీరు దొంగలా చూస్తే, "మల్లెపూవు కూడ దొంగిలించింది, దాని బుద్ధి ఎక్కడకు పోతుంది?" అంటారు. లేక సహృదయంతో చూస్తే "ఎంత చనువుగా మసలుతూందో?" అంటారు......"

"నిన్ను దొంగ అని పార్వతి అన్నదా?"

"పార్వతి నన్ను దొంగన్నా భరించేదాన్ని, కాని..." చెప్పలేక కళ్ళొత్తుకుంటూ ఆగిపోయింది గజ.

"చెప్పమ్మా ఏముంది?"

"అక్క నన్ను..." గజ ముఖం పాలిపోయింది. కంఠం రుద్ధమైంది.

"గుణ దగ్గర ఆ మాటనబట్టి సరిపోయింది. ఇంకొకరివద్ద అనివుంటే?...ముందు పెళ్ళి కావలసినదాన్ని..." తన కన్నీటి వరదనికి మాపలేక ముఖం ప్రక్కకు త్రిప్పుకొంది.

"వస్తా నన్నయ్యా" అంటూ దుఃఖాన్నాపుకోలేక వడివడిగా లేచి వెళ్ళిపోయింది. "గజా" అంటూ ఆత్రుతగా పిలిచింది పార్వతి. కాని ఆ పిలుపు గజకు విన్పించలేదు. పార్వతి గబగబ వెళ్ళి గజ చేయి పట్టుకొంది. గజ నిల్చుండి పోయింది.

"గజా...నిన్న పార్థం చేసుకొన్నాను. నన్ను క్షమించవూ?"అంటూ ఆమె రెండు చేతులు పట్టుకొని ప్రాధేయపడింది.

"అక్కా!" అంటూ ఆనందంతో పార్వతి హృదయంపై వాలిపోయింది గజ.

"మళ్ళీ ఓసారి వస్తావా గజా?" అని ఆప్యాయంగా ప్రశ్నించింది పార్వతి.

"అలాగే వస్తా" నంటూ కళ్లు తుడుచుకొని సంతోషంగా వెళ్ళిపోయింది. పార్వతి మెల్లగా గదిలోకి వచ్చింది. నర్సింగరావు వెనక్కి చేతులు కట్టుకొని పచార్లు చేస్తున్నాడు.

"మానేవా...నీ అనుమానం చేత ఆ లేత హృదయం ఎంత బాధపడిందో?" పతి పలుకులు విని పార్వతి లజ్జతో బాధతో మొగం దించుకుంది. ★